# తాగినవాళ్లు

తాగి వీధివెంట తూలుతూ నడుస్తూన్నవాడిని చూ. బుద్ధిమంతులు, నీతిపరులు అసహ్యించుకొంటారు. ఆ మనిషి దగ్గరకు పోరు. వాణ్ణి...భ్రష్టుడని, నీచుడని వేలెత్తి చూ. స్తారు. వాడు పతితుడు, పాపి సంఘానికి వేరుపురుగు వాడి. సభ్యతా సంఘంలో నిలబడటానికి స్థానంలేదు. వాడు తన కుటుంబానికి ద్రోహంచేస్తున్నాడు. భార్యకూ, బిడ్డలకూ, తిండిపెట్టక మాడుస్తున్నాడు తనకూ తన కుటుంబానికీ, హాని చేసుకొంటున్నాడు. నిజమే అదంతా.

నేను ఈ వ్యాసంవ్రాయటంలో ఉద్దేశం త్రాగుబోతు ప్రవర్తనలో ఉండే తమాషా చూపి, మిమ్ములను నవ్వమని అనటమే! మీరు నవ్వకపోయినా, మీకు నవ్వు రాక పోయినా, నేను ఏమీ చెయ్యలేను. కాకపోతే కొంచెము విచారపడతాను.

తాగిన సామాన్య మానవుని అసంబద్ధ ప్రలాపనలో నవ్వుపుట్టించే విషయము అంతగా లేదు. అల్లాటి వాడు బూతులు మాట్లాడుతాడు. ఏవో ఒళ్ళు తెలియని మాటలు మాట్లాడుతాడు.

శాస్త్ర చదువుకొని, సంస్కారంకలిగిన మనిషి తాగిన తరువాత అతని ప్రవర్తన, ఒక వింతగా ఉంటుంది.

శాస్త్ర సంస్కారంగల మనిషి తాగినా బూతులు మాట్లాడి అసభ్యంగా ప్రవర్తించడు కాని అతనికీ ఒళ్ళు తెలియకపోవటమూ విచిత్రంగా ప్రవర్తించటమూ తప్పదు.

ఒక నాగరికుడే త్రాగి వీధివెంట నడుస్తున్నాడు. అతడు సరియైన దారిని నడువక, మురుగు కాలవ ప్రక్కగా నడుస్తున్నాడు. ఒక కాలు కాల్వగట్టుపై పెట్టి రెండవ కాలు కాలువలో పెట్టి నడక సాగిస్తున్నాడు. ఒక కాలు ఎత్తున మరొక కాలు పల్లంలోనూ ఉంటే నడక ఎల్లాగ ఉంటుందో ఊహించుకోవచ్చు. ఒక పోలీసు ఉద్యోగి ఈ మనిషి విచిత్ర ప్రవర్తనను చూచి, ఏమయ్యా, అల్లాగ నడుస్తున్నావేం? అని అడిగాడు.

ఈ పెద్దమనిషి తెల్లపోయిచూచి ఏమీ తెలియని వాడిలాగ, ఏం. ఎల్లాగ నడుస్తున్నాను, అన్నాడు.

అదేమిటయ్యా, ఒక కాలు గట్టుపైన పెడితివి! ఇంకో కాలు కాలువలో పెడితివి! అల్లాగ ఎవరైనా నడుస్తారా, అని ఆ అధికారి మందలించాడు:

ఈ తాగిన వ్యక్తి చటుక్కున రెండుకాళ్లూ గటుపైకి లాగి, సరిగ్గా నిలుచుని, నమస్కరించి ఇల్లా అన్నాడు:

'కృతజ్ఞుణ్ణి బాబూ, ఇందాకటినుంచీ ఆలోచిస్తున్నాను. ఏమిట్రా బాబూ, ఒక కాలు పొడుగుగానూ, ఒక కాలు పొట్టిగానూ ఉన్నదేమా అని. నీవు ఈ సంగతి నాకు సకాలంలో చెప్పావు కాబట్టి సరిపోయింది లేకపోయినట్టయితే, ఆసుపత్రికి

వెళ్ళి ఈ కాలు కాస్త తెగగొట్టించుకోవలెనని ఆలోచిస్తు న్నాను. అంతపనీ జరిగిపోయేది.'

తాగినవాళ్ళ ప్రవర్తన సామాన్య మానవ ప్రవృత్తి నకు భిన్నంగా ఉంటుంది. కాబట్టి హాస్యాస్పదంగా ఉంటుంది. ఒక పెద్దమనిషి బాగా తాగి ఏదో ఊరుకు పోవాలని రైలు స్టేషనుకు పోయినాడు. టిక్కెట్టు కొనుక్కోవాలె కిటికీ వద్దకు పోయి, ఒక టిక్కెట్టు ఇయ్యండి అని అడిగాడు. అవతలి పెద్ద మనిషి ఎక్కడికి ? అన్నాడు. ఎక్కడికి వెళ్ళాలని అను కొన్నాడో ఇతనికి జ్ఞాపకం రాలేదు. అందుకని చాలుక్కన తెలివిగా అడిగాడు.

ఈ రైలుమీద స్టేషనులు ఏమేమి ఉన్నయ్యో కాస్త చెప్పండి, అని.

మరో ఆయన ఒళ్ళు తెలియని స్థితిలో వీధివెంట నడుస్తూ, తూలుతూవస్తూ మరొక సహోదరుని గట్టిగా కౌగ లించుకొని, అన్నా, కలిసి ఉంటే నిలబడుతాము, విడి పోయామా, ఒరిగిపోతాము, (United we stand, Divided we fall) అని నీతిబోధ చేశాడు.

ఒక రోజున బాగా తాగిన ముగ్గురు పెద్దమనుష్యులు జట్కాబండిలో వెడుతున్నారు. వారు ముగ్గురూ కూడా ఆనందంలో పరవశత చెందియున్నారు. వీధిమలుపులో ఒక చోట బండి ఆగిపోయింది.

---

ఆ జట్కాగుఱ్ఱానికి ఏదో పెంకెబుద్ధి పుట్టింది. యజమాని గుఱ్ఱాన్ని ప్రీతివాక్యాలతో బ్రతిమిలాడినాడు పెద్దమనుష్యులు బాడీలో కూర్చున్నారు. పెంకెతనం చెయ్యక, బండీ లాగవలసింది అని కోరినాడు. అప్పటికి లాభం లేకపోవటం చేత అతడు కొరడాతో దానిని మందలించి చూశాడు. చివరకు గట్టిగా బాదాడు. కాని ఆ గుఱ్ఱము యజమాని మాటలను పెడచెవిని బెట్టి అంతటితో ఊరుకోక, తన ఆత్మగౌరవానికి భంగకరమైన మాటలు అన్నందుకు, అతనిపై క్రోధము వహించి వెనక కాళ్ళు రెండూ, పైకెత్తి తన్నటం సాగించింది. లోపలఉన్న పెద్దమనుష్యులు ఈ దృశ్యాన్ని చూచి పకపకా నవ్వారు. జట్కాగుఱ్ఱానికీ చాలకోపం వచ్చింది. తనను జూచి హేళనగా నవ్విన మానవులను తన బండిలోనుంచి బైటకు వెళ్ళిపొండి అని గుఱ్ఱపు భాషలో గట్టిగా చెప్పి సకిలించింది. వాళ్లు వినక ఇంకా ఎక్కువగా నవ్వారు.

అప్పుడు, ఇక అవమానాన్ని భరించలేక, తన శక్తినంతా వినియోగించి ఆ ముగ్గురు మనుష్యులూ, బండిలోనుంచి బయటకు జారిపడేలాగున చేసి విజయ సూచకంగా సకిలించింది:

ముగ్గురూ నేలకూలారు. లేవటానికి శక్తి లేదు. వెల్లకిలా పడిఉన్నారు. అందులో ఒక పండితుడు కొంచెం శ్రమ

పడి శ్రేచికూర్చున్నాడు. జనం మూగింది. అతనికి చాలా సంతోషం కలిగింది. తాను రాజుననుకొన్నాడు. ప్రజలంతా తన దర్శనార్థము గుమిఃకూడినారని తోచింది.

'ధర సింహాసనమై' అన్నాడు గర్వాంగా నలుదిక్కులా చూస్తూ.

వెంటనే రెండోఆయన లేవలేని స్థితిలో వెల్లకిలా పడుకొని, 'నభంబు గొడుగై' అని ఆకాశంవంక చూశాడు.

మూడవపండితుడు 'తద్దేవతల్ భృత్యులై' ఆ జనం వంక చూపిస్తూ.

అంతా నవ్వారు.

ఇంతలో గుఱ్ఱపుబండివాడు వాళ్ళతో బండి ఎక్కండి అయ్యా, అని కోరాడు.

వాళ్ళంతాకూడా ఎక్కటానికి నిరాకరించి 'ఎక్కిన వారని గుఱ్ఱము గ్రక్కున విడువంగ వలయు'—అని ఏక గ్రీవంగా ఉద్ఘాటించి మరో బండిలో ఎక్కి వెళ్ళిపోయినారు.

తాగేవాళ్ళ మనఃస్థితినిగురించి విచారిస్తే ఒకటిరెండు తమాషాలు కనపడతవి! తాగినవాడు ఎప్పుడూ తాను తాగినట్లు ఒప్పుకోడు. ఏదో కాస్త పుచ్చుకొన్నా తనకు ఒళ్లు తెలియనిస్థితి ఎప్పుడూ రాదని గట్టి నమ్మకం.

తాను బాగా తాగినా చక్కగా తెలివితేటలతో మామూలు మనిషిలాగ మాట్లాడగలడనీ, ఇతరులు తాను తాగినట్లు చస్తే కనుక్కోలేరని అనుకొంటాడు.

తీరా బాగా తాగిన తరువాత కాస్త అనుమానం కలుగుతుంది. ప్రపంచం తాను తాగినట్లు తెలుసుకొన్నదేమోనని. ఈ అనుమానం అతనిని చాలా బాధపెడుతుంది. తన రహస్యం ప్రపంచానికి తెలియకూడదు. ఎల్లాగ తెలియకుండా ఉంచటం. అతడు తన బుద్ధినంతా వినియోగించి ఆలోచిస్తాడు. చివరకు అందరిని మోసపుచ్చటానికి కృతనిశ్చయుడై కనపడ్డ ప్రతివ్యక్తితోనూ అంటాడు: 'నేను తాగానని అనుకొన్నారా, ఏటండి. చట్—నేను అసుమంటోణ్ణి కాదు. బాబూ, కిట్టనోళ్లు లచ్చసెప్తారు. నేను అసలు తాగనుండి బాబూ' అని అప్పటికే అతనికి ఇంగిత జ్ఞానం పోయి ఉంటుంది.

ఈ త్రాగుడు సృష్ట్యాదినుంచీ వస్తూఉన్న ఆచారమే.

వేదయుగంలో ఆర్యులు సోమపానం చేసేవారు బ్రాహ్మణులుకూడా తాగేవారు.

పురాణాలలో కావలసినన్ని నిదర్శనాలు కనపడతవి. రాజులు తాగేవారిని చూపటానికి అప్పుడప్పుడు స్త్రీలుకూడా

తాగేవారని తోస్తుంది-సుధేష్ణకు శిరోవేదన కలగటమూ, ఆమె, సైరంధ్రిని మదిర తెమ్మని. కీచకుని ఇంటికి పంపటమూ అందరికి తెలిసిన విషయమే!

తాగినవాడికి చాలా ఆనందంగా ఉంటుంది కాసేపు. వాడు ప్రపంచంలోని కష్టాలన్నీ మరిచిపోయి మహానందాన్ని అనుభవిస్తాడు.

దుఃఖభూయిష్ఠమైన ఈ పాడుప్రపంచంలో తాత్కాలికమైనా సరే, గొప్ప ఆనందాన్ని ఇచ్చేది ఈ త్రాగుడే.